
శీలం అన్నది 'శరీరానికి' మాత్రమే సంబంధించిన విషయమైతే ఆడవాళ్లంతా చాలా వరకూ అదృష్టవంతులు. కానీ అది కేవలం 'మనసు'కి మాత్రమే పరిమితమైనదైతే.... ఈ సృష్టిలో మగాడంత దురదృష్టవంతుడు ఇంకోడులేడు!

ఎందుకంటే... వాడి తల్లో, చెల్లో... వాడి భార్యో లేక బిడ్డో భూమిమీదకన్ను తెరచింది మొదలు వృద్ధ భానుని వెన్ను విరిగే వరకు... విశపతి నిద్ర లేచింది మొదలు... తూర్పున ఎర్ర ముద్ర పడేవరకూ....బస్టాప్‌లోనో.... బాస్ రూముల్లోనో.... కాలేజీల్లోనో..... కార్ఖానాల్లోనో.... షాపుల్లోనో... సెంటర్లోనో ఒక చోటేమిటి? అవసరముండి స్త్రీ బయటికి అడుగు వేసిన ప్రతి ప్రదేశంలోనూ బహిరంగంగా..... నిర్దయగా నీచంగా అమానుషంగా రేప్ చేయబడుతోంది!



# చెప్పరా... చిట్టితల్లీ

శింగరాజు మాధవరావు

